## క్లుప్తంగా

### వైభవంగా శ్రావణమాస పూజలు



**భట్టిప్రోలు:** శ్రావణమాసం పురస్కరించుకుని చివరి శుక్రవారం దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. భట్టిప్రోలు, అద్దేపల్లి గ్రామ దేవతలు శ్రీ దండిపార్వతి, శ్రీ ఆడెమ్మ తల్లి, అలానే భట్టిప్రోలు హిందూ శ్మశానవాటికలో కొలువైన శ్రీగుండిపార్వతికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదపులివర్రు గ్రామ దేవత శ్రీగోగులమ్మ, శ్రీభూనీళా సమేత శ్రీవరదరాజస్వామి దేవాలయంలోని శ్రీపేరిందేవి, శ్రీరాజరాజ నరేంద్ర స్వామి దేవాలయంలో శ్రీబాలాత్రిపుర సుందరి అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. వెల్లటూరు గ్రామదేవత శ్రీకట్లమ్మ తల్లి దేవాలయంలో అమ్మవార్లు ప్రత్యేక అలంకారాల్లో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవార్లకు సామూహికంగా పూజలు నిర్వహించి తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.

### విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ



**వెల్లటూరు(భట్టిప్రోలు):** భట్టిప్రోలు మండలం వెల్లటూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (జీసీ, ఎల్ఈ, హెచ్‌డబ్ల్యూ, భట్టిప్రోలు ఎంజీఎస్) విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్‌ను దాతలు శుక్రవారం పంపిణీ చేశారు. గుంటూరుకు చెందిన భవాని ఎలక్ట్రికల్స్ కాంట్రాక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ నల్లూరి నాగేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు కేవీఎల్ కాంతారావు, అభ్యర్థన మేరకు వీటిని విద్యార్థులకు అందజేశారు. అనంతరం విద్యార్థులకు పరిశుభ్రత, ఆరోగ్యం, నీటి వినియోగం, ప్లాస్టిక్ నిషేధం వంటి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో నీలం దేవరాజు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కె.అరుణ కుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.సురేష్‌కుమార్, జేపీ పునయ్య, ఓ.రోజామణి, అల్తాఫ్‌హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



**రేపల్లె:** చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని సీతారామ యోగిని కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన కాపు సేవా సమితి 16 వార్షికోత్సవంలో జనసేన పార్టీ నాయకులు కమతం సాంబశివరావు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా 21 మంది విద్యార్థులకు రూ 85,000 ప్రోత్సాహ బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు చందు సాంబశివరావు, గాదె వెంకటేశ్వరరావు, దేవగిరి సాంబశివరావు, మల్లెల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. కూచినపూడిలో చిరంజీవి అభిమాన సంఘం నాయకుడు తోట వెంకట రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జనసేన పార్టీ పట్టణ కన్వీనర్ రాసంశెట్టి మహేష్ పాల్గొని కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కునపరెడ్డి జగదీష్ , నాగేశ్వరరావు, కొలసాని అనిల్, తోట శ్యామ్, కోటేశ్వరరావు, నల్లపాటి రాజశేఖర్, పున్నారావు, వెంకటేశ్వరరావు, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### ఎండమావులుగా ఎస్సీ, ఎస్టీల సంక్షేమం

**దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రం**

**బాపట్ల:** కూటమి ప్రభుత్వం ఏడాదిగా ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ ఋణాలు, సబ్ ప్లాన్ నిధులు ఇవ్వకుండా సంక్షేమాన్ని ఎండమావులుగా మార్చిందని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ధ్వజమెత్తారు. దళితుల భూమి సమస్యలపై ఆయన శుక్రవారం బాపట్ల కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా నాగేంద్రం మాట్లాడుతూ.. మాల కార్పొరేషన్‌కు రూ.341 కోట్లు, మాదిగ, రెల్లి కార్పొరేషన్లకు వందల కోట్ల రూపాయలు 2024–25 ఆర్థిక సంవత్సరంలో పేరుకి కేటాయించి ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడమే సుపరిపాలనా.. అని మండిపడ్డారు. కార్యక్రమంలో దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షులు మాచవరపు జూలియస్, బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు డాక్టర్ గుదే రాజారావు, శీలం రోజన్ బాబు, మాల మహానాడు అధ్యక్ష కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, మంచాల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# వంతెన అప్రోచ్ రోడ్లకు మోక్షం ఎప్పుడో!



శిథిలావస్థకు చేరిన పెదపులివర్రు పాత వంతెన



ప్రారంభానికి నోచుకోని పెదపులివర్రు వద్ద నిర్మించిన వంతెన

- పనులు పూర్తయినా వినియోగంలోకి రాని వంతెన
- శిథిలావస్థ వంతెనపైనే నేటికీ రాకపోకలు
- ఎనిమిదేళ్లుగా నిరుపయోగంగా కొత్త వంతెన

**భట్టిప్రోలు:** డెల్టా ఆధునీకీకరణ పనుల్లో భాగంగా ఎనిమిదేళ్ల కిందట కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్‌పై పెదపులివర్రు, ఓలేరు గ్రామాల వద్ద వంతెనలు నిర్మించారు. రూ.1.76 కోట్లతో ఈ వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. వంతెన పనులు నిర్విరామంగా జరగడంతో త్వరితగతిన వినియోగంలోకి వస్తుందని స్థానిక ప్రజలు ఆశించారు. ఇటీవల ఓలేరు వంతెనకు అప్రోచ్ రహదారిని ఏర్పాటు చేయడంతో రాకపోకలు కొనసాగుతున్నాయి. కానీ పెదపులివర్రు వంతెన మాత్రం ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో బ్రిటీష్ కాలంలో నిర్మించిన పాత వంతెనపైనే ప్రస్తుతం ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు కొనసాగిస్తున్నారు.

**ట్రాఫిక్‌కు అంతరాయం..**

భట్టిప్రోలు, రేపల్లె, తెనాలి ప్రాంతాల నుంచి కృష్ణానది పరివాహక లంక గ్రామాలకు లారీలు, ఆటోలు రాకపోకలు తరచూ జరుగుతున్నాయి. అలాగే పాఠశాలల బస్సులు కూడా ప్రయాణిస్తుంటాయి. శిథిలావస్థకు చేరిన వంతెన ఇరుకుగా ఉండడంతో పాటు ఎదురుగా వాహనం వస్తే తప్పుకోవాలంటే కష్ట తరంగా మారింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని ప్రజలు వాపోతున్నారు. పాఠశాలల బస్సులు, వ్యవసాయ ఉత్పత్తులతో వెళ్లే లారీలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదని స్థానికులు చెబుతున్నారు.

**గ్రామస్తుల అసహనం..**

పెదపులివర్రు వంతెన నిర్మాణం పూర్తయినా వంతెనకు అప్రోచ్ రోడ్డు వేయకపోవడంతో రాకపోకలు జరగడంలేదు. రూ.90 లక్షలతో పెదపులివర్రు.. రూ.86 లక్షలతో ఓలేరు వంతెనలను ఏక కాలంలో పూర్తి చేశారు. ఓలేరు వంతెనకు అప్రోచ్ రహదారి వంతెన ఏర్పాటు చేసి, పెదపులివర్రుకు అప్రోచ్ రహదారి ఏర్పాటు చేయకపోవడంపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణం పూర్తైన నేపథ్యంలో అప్రోచ్ రోడ్లకు కూడా మోక్షం కలిగితే బాగుండునని వాహనదారులు వాపోతున్నారు.

## బాబు పాలనలో మోసం గ్యారెంటీ



కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

**ఓలేరు(భట్టిప్రోలు):** భట్టిప్రోలు మండలం ఓలేరు పంచాయతీ పరిధిలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ కేసన వెంకట్రావు అధ్యక్షతన శుక్రవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు పిలుపు మేరకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ.. బాబు పాలనలో మోసం గ్యారెంటీ అన్నారు. కూటమి ఏడాది పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పడమట శ్రీనివాసరావు, వివిధ విభాగాల పార్టీ నాయకులు జంగం వాసు, తదితరులు పాల్గొన్నారు.

**నేడు ముత్తుపల్లిలో..**

**రేపల్లె:** నిజాంపట్నం మండలం ముత్తుపల్లిలో శనివారం సాయంత్రం 4 గంటలకు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యార్లగడ్డ వెంకటరాంబాబు శుక్రవారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యే ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**భట్టిప్రోలు:** భట్టిప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ లైన్ల మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి అసిస్టెంట్ ఇంజినీర్ ఎం.శాంత కుమారి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఖాతాదారుల శ్రేయస్సే లక్ష్యంగా సేవలు



**నగరం:** ఖాతాదారుల శ్రేయస్సే లక్ష్యంగా ఇండియన్ బ్యాంక్ మెరుగైన సేవలు అందిస్తుందని అమరావతి డెప్యూటీ జోనల్ మేనేజర్ కె.కృష్ణమోహన్ తెలిపారు. స్థానిక ఇండియన్ బ్యాంక్‌లో శుక్రవారం నిర్వహించిన వినియోగదారుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 700 బ్రాంచ్‌లలో సుమారు రూ.13 లక్షల కోట్ల టర్నోవర్ ఇండియన్ బ్యాంక్‌లో జరుగుతుందన్నారు. అనంతరం తాము అందిస్తున్న సేవలను వివరించారు. బ్యాంక్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రభుకిరణ్, బ్యాంక్ సిబ్బంది దివ్య, చాణిక్య, రాజు, కృష్ణ, ఐశ్వర్య పాల్గొన్నారు.

## రాష్ట్ర సదస్సులను విజయవంతం చేయాలి



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

**రేపల్లె:** గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈనెల 30, 31వ తేదీల్లో జరుగనున్న ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర సదస్సులను విజయవంతం చేయాలని సీనియర్ న్యాయవాది, మాజీ ప్రభుత్వ సహాయ న్యాయవాది దారం సాంబశివరావు కోరారు. శుక్రవారం రేపల్లె పట్టణం న్యాయస్థానాల ప్రాంగణంలో రేపల్లె బార్ అసోసియేషన్ న్యాయవాదులతో కలిసి గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం, న్యాయ వ్యవస్థ, మానవ హక్కులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందన్నారు. న్యాయవాదుల సంక్షేమం కోసం ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. సదస్సుకు రాజ్యాంగ నిపుణులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు హాజరవుతారని తెలియజేశారు. న్యాయవాదులు, ప్రజా సంఘాలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు దోవా రమేష్ రాంజీ, మెండు వెంకట సుబ్బారావు, దాసరి శ్రీవల్లి, కట్టుపల్లి మేరీ, ప్రతాప్, జమీర్, మునిపల్లి సుబ్బయ్య, పి.నాగాంజనేయులు, రేవు నాగరాజు, పమిడిపాటి భూషణం , ఒడుగు రాంబాబు, బడుగు ఫణికుమార్, ఎడ్ల గోపిరాజు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి ఫిల్టర్‌బెడ్ పరిశీలన

**బాపట్ల అర్బన్:** ఫిల్టర్‌బెడ్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి మున్సిపల్ ఇంజినీరింగ్‌శాఖను ఆదేశించారు. బెడ్లు శుభ్రం చేయడంతో శుభ్రమైన నీటి సరఫరా చేయగలుతామని ఆయన సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎస్ఎస్‌ట్యాంకు, ఫిల్టర్‌బెడ్‌ను ఆయన పరిశీలించారు. మంచినీటి ఎద్దడి లేకుండా సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నీటి నిల్వలను 17 అడుగులకు చేసుకున్నట్లు ఆయనకు ఇంజినీరింగ్ అధికారులు వివరించారు. ప్రతి వార్డులో సచివాలయం ఉద్యోగులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. కమిషనర్‌తో పాటు డీఈ కృష్ణారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణ ఉన్నారు.

## వరద ఉధృతిని పరిశీలించిన మంత్రి మనోహర్



పంటల నష్టం గురించి తెలుసుకుంటున్న మంత్రి మనోహర్

**కొల్లిపర:** కృష్ణా నదిలో నిలకడగా గత వారం రోజుల నుంచి కొనసాగుతున్న వరద ఉధృతిని శుక్రవారం మండల పరిధిలోని పాతబొమ్మువానిపాలెంలో తహసీల్దార్ జి.సిద్ధార్థ, తెనాలి హార్టికల్చర్ అధికారి తోటకూర శ్రీనిత్య, వివిధ శాఖల అధికారులతో కలిసి మంత్రి మనోహర్ పరిశీలించారు. వరద కారణంగా ఉద్యాన పంటలకు ఎంత మేరకు నష్టం జరిగింది అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక మెడికల్ క్యాంపును పరిశీలించి గ్రామంలోని ప్రజల ఆరోగ్య పరిస్థితులను సర్పంచి కొల్లి రజినిను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం నదిలో వరద 4.50 లక్షల క్యూసెక్కులు ప్రవహిస్తోందని, 24 గంటల్లో సుమారు 6 లక్షల క్యూసెక్కులకు వరద చేరే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. నష్టం జరిగిన రైతులకు వెంటనే ప్రభుత్వం నుంచి విత్తనాలు, ఎరువులు అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవ్, వీఆర్వో రామరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆలయంలో భక్తుల హోమాలు



**అమృతలూరు(భట్టిప్రోలు):** శైవ క్షేత్రమైన అమృతలూరు మండలం గోవాడలో కొలువైన శ్రీ బాల కోటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీ గంగా పార్వతి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయంలో కార్యనిర్వాహణాధికారి బి.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులు స్వర్ణ శ్రీనివాస శర్మ, అర్చకులు చావలి శ్రీధర్ శర్మ, పొన్నపల్లి సత్యనారాయణ విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులు హోమలు నిర్వహించారు.

# వెనుదిరిగిన దివ్యాంగులు



ప్రశ్నిస్తున్న దివ్యాంగులు

**తెనాలి అర్బన్:** తెనాలిలోని సదరం క్యాంప్‌లో నెలకొన్న గందరగోళం శుక్రవారమూ తొలగలేదు. బాపట్ల రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆర్థోపెడిక్ విభాగానికి చెందిన దివ్యాంగులు కొందరు తెనాలి జిల్లా వైద్యశాలకు వచ్చి ఆ విభాగ క్యాంప్ జరగడం లేదని తెలియడంతో వారు కొద్దిసేపు ఆందోళన చేసి వెనుతిరిగారు. వివరాలలోకి వెళ్తే.. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు రీ వైద్య పరీక్షలు చేయించాలని భావించింది. దీనిలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో కొద్దినెలల క్రితం ఆర్థో, సైక్రాటిక్, ఈఎన్‌టీ, అప్తామాలజీ విభాగాల సదరం క్యాంప్‌ను నిర్వహించారు. ఆ సయమంలో హాజరుకాని బాపట్ల రెవెన్యూ డివిజన్ పరిధిలోని దివ్యాంగులను సచివాలయ ఉద్యోగులు గుర్తించి వారిని తెనాలిలోని సదరం క్యాంప్‌నకు పంపుతున్నారు. ఇక్కడ ఈఎన్‌టీ, సైక్రాటిక్ విభాగాల దివ్యాంగులకు వైద్య పరీక్షలు చేస్తూ వస్తున్నారు. చీరాలకు చెందిన ఈఎన్‌టీ వైద్యురాలు, నర్సారావుపేటకు చెందిన సైక్రాటిక్ వైద్యులు ఇక్కడ ప్రతిరోజు సేవలు అందిస్తున్నారు. శుక్రవారం రెండు విభాగాలతో పాటు ఆర్థోపెడిక్ విభాగానికి సంబంధించిన దివ్యాంగులు కొందర్ని సచివాలయ ఉద్యోగులు తెనాలి పంపారు. కానీ ఆ విభాగానికి సంబంధించిన క్యాంప్ జరగడంలేదని, వైద్యులను కూడా నియమించలేదని వారికి తెలియడంతో ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి బాపట్ల డీఆర్‌డీఏ అధికారులతో మాట్లాడారు.

## డ్రెయిన్ల నిర్మాణ పనులు పరిశీలన

**తెనాలి టౌన్:** రూరల్ మండల గ్రామం కొలకలూరులో మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణ పనులను 'డ్వామా' ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ శుక్రవారం పరిశీలించారు. తొలిసారిగా నిర్మించే ఈ మ్యాజిక్ డ్రెయిన్ల కారణంగా మురుగు ఎప్పటికప్పుడు భూమిలోకి ఇంకుతుందని ఆయన చెప్పారు. నేల నీటిని త్వరితగతిన గ్రహించే అవకాశం ఉందన్నారు. ఫలితంగా దోమల వ్యాప్తికి ఆస్కారం ఉండదన్నారు. సిమెంటు కాలువలతో పోలిస్తే వీటి నిర్మాణ వ్యయం తక్కువగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇందుకు పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ ముందుగానే గ్రామంలో పర్యటించి తగిన ఆదేశాలు జారీ చేసినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్, ఇన్‌చార్జి గ్రామ పంచాయతీ కార్యదర్శి కరిముల్లా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల నియంత్రణ



**కర్లపాలెం:** సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు కర్లపాలెం ఎస్ఐ జి.రవీంద్ర తెలిపారు. శుక్రవారం కర్లపాలెం సెంటర్‌లో ఎస్ఐ రవీంద్ర వాహనాల తనిఖీ నిర్వహించారు. అనంతరం డ్రోన్ సహాయంతో ట్రాఫిక్‌కు సంబంధించిన విజువల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహిరంగంగా మద్యం తాగే వారిని, శివారుల్లో జూదం ఆడేవారిని డ్రోన్ సహాయంతో గుర్తించి చట్టప్రకారం కేసులు పెడతామన్నారు. గ్రామాల్లో గణేష్ ఉత్సవాలను నిర్వహించే వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి

**నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు**

**భట్టిప్రోలు:** వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలకు అనుమతులు తప్పనిసరి అని స్థానిక ఎస్ఐ ఎం.శివయ్య తెలిపారు. నిర్వాహకులు విధిగా ఏపీ పోలీస్‌శాఖ ప్రవేశ పెట్టిన వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని శుక్రవారం ఆయన పేర్కొన్నారు. ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని అన్నారు. అనుమతి లేకుండా వినాయక విగ్రహాల ఏర్పాటు చేయవద్దని పేర్కొన్నారు.

**అమర్తలూరు(వేమూరు):** వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పని సరిగా అనుమతులు పొందాలని ఎస్ఐ కుంచాల రవితేజ తెలిపారు. అమర్తలూరు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విగ్రహాలు ఏర్పాటు చేసే కమిటీ సభ్యులు మండపం ప్రదేశం, విగ్రహం ఎత్తు, బరువు, నిమజ్జనం తేదీ, ప్రాంతం, రూట్‌మ్యాప్ తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

**చెరుకుపల్లి:** వినాయక చవితి పందిళ్లు ఏర్పాటు చేసుకునే కమిటీ నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని స్థానిక ఎస్ఐ టి.అనీల్‌కుమార్ తెలిపారు. కమిటీ నిర్వాహకులు మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి httpr://faner-hhut-ra-v.net అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సింగిల్‌విండో ద్వారా అనుమతి పొందాలన్నారు. అనుమతి లేకుండా మండపాలు, పందిళ్లు ఏర్పాటు చేయవద్దని ఎస్ఐ తెలిపారు.

## సాయిబాబు ఆశయ సాధనకు అనుగుణంగా పని చేయాలి



నివాళులు అర్పిస్తున్న పార్టీ నాయకులు

**భట్టిప్రోలు:** కామ్రేడ్ దివి సాయిబాబు ఆశయ సాధనకు అనుగుణంగా ప్రతి కార్యకర్త పని చేయాలని సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య పేర్కొన్నారు. భట్టిప్రోలులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం కామ్రేడ్‌సాయిబాబు 19వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ.. సాయిబాబు సీపీఎం పార్టీలో విద్యార్థి ఉద్యమంతో ప్రారంభమై కార్మిక, కర్షక, చేనేత, వంటి అనేక ప్రజా ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషించి చివరి శ్వాస వరకూ పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. తొలుత ఆయన చిత్రపటానికి ఆయన సతీమణి రజని, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతకు ముందు వేమూరు, రేపల్లె నియోజకవర్గం పార్టీ సభ్యులకు రాజకీయ శిక్షణా తరగతులను ఎస్ఎఫ్ఐ నాయకులు పి.మనోజ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులు టి.కృష్ణమోహన్, భట్టిప్రోలు మండల కార్యదర్శి జి.సుధాకర్, సీపీఎం నాయకులు ఎమ్. సత్యనారాయణ, గోళ్ల నాగరాజు, బొనిగల సుబ్బారావు, దానియేలు, కె.వి.లక్ష్మణరావు, నవీన్, నాగమల్లేశ్వరరావు, దీపాల సత్యనారాయణ, జి.నాగరాజు, పి.శంకరరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ కాలనీకి మంచినీటి సరఫరా చేయాలి



సమస్యను వివరిస్తున్న వైఎస్సార్ కాలనీ వాసులు

**బాపట్ల అర్బన్:** పట్టణంలోని వైఎస్సార్ కాలనీకి మంచినీటి సరఫరా చేయాలని పలువురు మహిళలు శుక్రవారం మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి దృష్టికి సమస్యను తెచ్చారు. కాలనీకి చెందిన 50 మందికి పైగా మహిళలు మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని మంచినీటి సమస్యపై అధికారులతో మాట్లాడారు. కాలనీలోని మంచినీటి పైపులైన్లలో సక్రమంగా నీరు రాకపోవడంతో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేవారని వివరించారు. తాజాగా పైపులైన్లు వేశామని ట్యాంకర్లు పంపడం లేదని తెలిపారు. పైపులైన్లలో నీళ్లు సక్రమంగా రాకపోవడంతో పాటు ట్యాంకర్లు కూడా నిలుపుదల చేయడం తీవ్ర ఇబ్బందిగా మారిందని అన్నారు. నీటి సరఫరా సజావుగా జరిగే వరకూ ట్యాంకర్లను పంపాలని మహిళలు కోరారు. గతంలో వలే ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తామని కృష్ణారెడ్డి హామీ ఇచ్చారు.

## రీ సర్వేను సమర్థంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రామలక్ష్మి

**రేపల్లె:** భూముల రీ సర్వే కార్యక్రమాన్ని సమర్థంగా పూర్తి చేయాలని ఆర్డీవో నేలపు రామలక్ష్మి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రేపల్లె, నిజాంపట్నం మండలాల్లోని గ్రామ రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. త్వరలో భూముల రీ సర్వే కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. సర్వేలో భాగంగా రెవెన్యూ రికార్డులను సవరించడంతో పాటు భూములను సక్రమంగా సర్వే నిర్వహించి నిర్ధిష్ట కొలతలు నిర్ధారించాలన్నారు. రైతుల నుంచి అభ్యంతరాలు రాకుండా అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. భూములకు సంబంధించి ఎవరైనా మరణించి ఉంటే వారి పేరు తొలగించడంతో పాటు వారి వారసుల పేర్లను జతచేయాలని ఆదేశించారు. సర్వేలో పొరపాట్లు చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్వేలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమావేశంలో తహసీల్దార్ మోర్లా శ్రీనివాసరావు డిప్యూటీ తహసీల్దార్ నిరంజన్ బాబు, ఆర్ఐ రాంబాబు తదితరులు ఉన్నారు.

## పీహెచ్‌సీల్లో ప్రసవాలు జరిగేలా చూడాలి

**జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి**



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

**తెనాలి టౌన్:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి ఆదేశించారు. రూరల్ మండలం కొలకలూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. గర్భిణుల ఆరోగ్య పరీక్షలను పరిశీలించారు. వారితో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. కాన్పులన్నీ ఆరోగ్య కేంద్రంలోనే జరిగేలా సిబ్బంది శ్రద్ధ పెట్టాలని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని.. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తగిన సలహాలను ఇవ్వాలని చెప్పారు. ఈ సందర్భంగా రిటైర్డు జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ నరేంద్ర తన సొంత ఖర్చులతో 60 మంది గర్భిణులకు పౌష్టికాహార కిట్లను డాక్టర్ విజయలక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వి.అన్నపూర్ణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు, డాక్టర్ యు.దిలీప్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## రైతులకు సరిపడా యూరియా అందించాలి



దెబ్బతిన్న పొలాలను పరిశీలిస్తున్న శివసాంబిరెడ్డి

**తెనాలి:** రైతులకు సరిపడా యూరియాను ప్రభుత్వం అందజేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. రూరల్ మండలంలోని తేలప్రోలు, కంచర్లపాలెం గ్రామాల్లోని పంటపొలాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు అడుసుమిల్లి పవన్, ఎర్ర నారాయణ తమ సమస్యలను తెలియజేశారు. రెండు సార్లు వెదపెట్టామని.. మూడోసారి ఇటీవలి భారీ వర్షానికి వరద ముంపునకు గురైందని చెప్పారు. వరి నారు కొనుగోలు చేసి నాటుకోవాలంటే రూ.13 వేలు అవుతుందని రైతులు తెలిపారు. శివసాంబిరెడి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కౌలు రైతులకు మొండి చేయి చూపుతోందని.. అదే బాటలో రాష్ట్ర ప్రభుత్వం నడుస్తోందని మండిపడ్డారు.